నేడు జేఎన్‌టీయూహెచ్‌లో ఓరియెంటేషన్ కార్యక్రమం

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శుక్రవారం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం హాజరు కానున్నారు. అదే విధంగా గౌరవ అతిథులుగా జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ డా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు తదితరులు హాజరుకానున్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జేమ్స్ తదితరులు

కుత్బుల్లాపూర్: భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని దళిత సంఘాల నేత అవిజె జేమ్స్ అన్నారు. గురువారం సూరారంలోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలకు నిత్యపూల మాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేమ్స్ అంజన్న, విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిత్య పూల పూజ వంద రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంలో చేర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతో పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతామని ఆయన తెలిపారు.

ఆదాయంపై పట్టింపేది?



వాణిజ్య సముదాయాలకు పొందని లైసెన్స్
ప్రతిఏటా పునరుద్ధరణపై నిర్లక్ష్యమే
మున్సిపల్ యంత్రాంగంపై విమర్శల వెల్లువ

సాక్షి, సిటీబ్యూరో: పురపాలక సంఘాల పరిధిలోని ప్రధానరోడ్లతో సహా కాలనీల్లో ఇబ్బడి ముబ్బడిగా వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు వెలుస్తున్నా.. ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సుల జారీ జరగటం లేదు. సంబంధిత వ్యాపారులు కూడా ట్రేడ్ లైసెన్సులపై శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పన్నుల మదింపులో తేడాలు..

ట్రేడ్ లైసెన్సుల జారీ విషయం అటుంచితే విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, హోటళ్లు, దుకాణాలకు సంబంధించిన పన్నుల మదింపులో తేడాలు కోకొల్లలని తెలుస్తోంది. దీంతో పురపాలక సంఘాలకు ప్రతి ఏటా పెద్ద ఎత్తున రావలసిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. దీనికి ప్రధాన కారణం పురపాలక సంఘాల్లోని కొంతమంది సిబ్బంది నిర్వాకంతో పాటు అవినీతి,అక్రమాలకు తలొగ్గటమేనన్న ఆరోపణలున్నాయి.

ట్రేడ్ లైసెన్సులిలా..

వ్యాపార వాణిజ్య సముదాయాలు, దుకాణాలు నడపాలన్న నిబంధనల ప్రకారం పురపాలక సంఘాలకు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సుకు సంబంధిత వ్యాపారులు తగిన రుసుము చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. కాగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 13 పురపాలక సంఘాల్లో ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక బృందాలను నియమించినప్పటికీ లక్ష్యానికి దూరంగానే ఉంటున్నాయి.

రహదారుల ఆధారంగా ..

పురపాలక సంఘాల పరిధిలో వ్యాపారం నిర్వహించుకునేందుకు విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఫీజులు చెల్లించేవారు. కాగా ప్రభుత్వం పురపాలక సంఘాలకు ఆదాయం పెంచే ఉద్దేశంతో జీవో జారీ చేసింది. ఈ జీవో ప్రకారం 20 అడుగుల లోపు ఉన్న రోడ్డును సింగిల్ లైన్, 30 అడుగుల లోపు ఉన్న రోడ్డును డబుల్‌లైన్, 30 అడుగుల కంటే ఎక్కువగా ఉన్న రోడ్డును మల్టిపుల్‌లైన్‌గా విభజించారు. ఆయా రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాల విస్తీర్ణాన్ని బట్టి చదరపు అడుగుకు కనిష్ఠంగా రూ.3, గరిష్ఠంగా రూ.7 చెల్లించి లైసెన్స్ తీసుకోవాలని నిబంధన పెట్టారు. దీంతో చాలా మంది దుకాణాల నిర్వాహకులు లైసెన్సులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రతి ఏటా ఏప్రిల్‌లో దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు పునరుద్ధరించుకోవాలని పురపాలక సంఘాల కమిషనర్లు చెబుతున్నా.. ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు.

విలీన పంచాయతీల్లోనూ అంతే...

పురపాలక సంఘాల పరిధిలో విలీన గ్రామ పంచాయతీల్లో పెద్దఎత్తున దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఉన్నవాటికి రెట్టింపు సంఖ్యలో కొత్తగా దుకాణాలు, వాణిజ్య, వ్యాపారసంస్థలు వెలిశాయి. చాలా వాటికి ట్రేడ్ లైసెన్సులు పొందకుండానే వ్యాపార సముదాయాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

- బోడుప్పల్, నిజాంపేట్, జవహర్‌నగర్, దుండిగల్, కొంపెల్లి, నాగారం, పోచారం పురపాలక సంఘాల్లో మొత్తంగా 11,056 వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నట్లు.. మున్సిపల్ ఉద్యోగులు గుర్తించినప్పటికీ, ట్రేడ్ లైసెన్సులు మాత్రం 3,998 షాపులకు ఉన్నాయి. ఈసారి పురపాలక సంఘాల్లో మున్సిపల్ అధికారులు గుర్తించిన వాటిలో కూడా 7,058 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదని తెలుస్తోంది. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2035 వ్యాపార సముదాయాలు ఉండగా.. ట్రేడ్ లైసెన్సులు పొందిన దుకాణాలు 455 మాత్రమే ఉన్నాయి. నిజాంపేట నగర పాలక సంస్థలో 4354కు 2135, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 750కి, 282, దుండిగల్ మున్సిపాలిటీలో 1,248కి గానూ 432, కొంపెల్లిలో 1,047కు 256,నాగారంలో 1,211 వ్యాపార సముదాయాలకు 265 ట్రేడ్ లైసెన్సులు, పోచారంలో 411 దుకాణాలకు 173 షాపులకు మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి.
- పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, తూముకుంట పురపాలక సంఘాల్లో ఇదే పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. రుణం తీసుకున్న వారు మినహా..

బ్యాంకులో రుణం తీసుకున్న వారు మినహా మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

- జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా పురపాలక సంఘాల్లో మరింత ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, కిరాణ దుకాణాలు, సెల్ పాయింట్లు, మొబైల్ షోరూంలు, వస్త్ర దుకాణాలు, ఆన్‌లైన్ సెంటర్లు తదితర వాణిజ్య సంస్థలు భారీగా పెరిగిపోయాయి. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరిగిపోతున్నా... చాలామంది నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ పొందడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి రూ. లక్షల్లో గండి పడుతోంది.

శుభాకాంక్షలు తెలిపిన నేతలు



రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతినిధులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విజయం సాధించిన వల్లకాటి రాజ్‌కుమార్‌ను గురువారం ఆయన నివాసంలో పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు ఆంజనేయులు, జిల్లా గణేష్, శ్రీరాముల వెంకట కుమార్, చిరంజీవి, మక్యం నవీన్, డాక్టర్ వంగరి విష్ణు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహనీయుల జాతరను విజయవంతం చేయాలి



హెచ్‌సీయూ ప్రధానగేటు సమీపంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రాయదుర్గం: బీసీల మహానేత బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని జరిగే మహనీయుల జాతరను విజయవంతం చేయాలని సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ కోరారు. ఏఐటీబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మహనీయుల జాతర పోస్టర్, కరపత్రంను గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని, సామాజిక న్యాయం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీబీసీఎస్‌ఏ, సామాజిక న్యాయ జేఏసీ నాయకులు వసుమతియాదవ్, రాకేష్‌దత్త, ప్రవీణ్, లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వికాస్‌కుమార్ (ఫైల్)

మియాపూర్: పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు తిరిగి ఇంటికి రాని సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ హఫీజ్‌పేటలోని మార్తాండనగర్‌కు చెందిన వికాస్‌కుమార్ (25) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఫలితం లేకపోవడంతో భార్య రీనా కుమారి బుధవారం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం



జలకన్య హోటల్ వద్ద సీసీ రోడ్డు నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు నుంచి తులసివనం వరకు రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం పరిశీలించారు. అదే విధంగా జలకన్య హోటల్ వద్ద రూ. 27 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ ప్రాంతాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల ట్రాఫిక్ సమస్య నేటితో పరిష్కారం అవుతుందని, ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు కాశీనాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్, చిన్నోళ్ల శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, కుమార చారి, సంపత్ రెడ్డి, కృష్ణగౌడ్, చంద్రశేఖర్, రామకృష్ణ, శంకర్‌రావు, హేమలత, యాదవ్‌రెడ్డి, దుర్గయ్య, విఠల్, సుబ్రహ్మణ్య రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని తోటి కూలీపై దాడి

కేపీహెచ్‌బీకాలనీ: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో తోటి అడ్డా కూలీపై దాడికి పాల్పడి, అతని వద్ద డబ్బులను లాక్కొని వెళ్లిన నలుగురు వ్యక్తులపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదర్‌నగర్‌లో నివాసం ఉండే నజీర్ నిజాంపేట చౌరస్తా వద్ద అడ్డా కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం అతడికి పని డబ్బులు రూ.2,500 వచ్చాయి. అది తెలుసుకున్న తోటి కూలీ మజ్జు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని నజీర్‌ని అడిగాడు. అతను నిరాకరించాడు. నజీర్ ఇంటికి వెళ్లే సమయంలో నిజాంపేట డబుల్ రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో మూత్ర విసర్జన చేస్తుండగా మజ్జుతో పాటు మరో ముగ్గురు కలిసి దాడి చేశారు. నజీర్‌ను తీవ్రంగా కొట్టి డబ్బులను తీసుకొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మజ్జును అదుపులోకి తీసుకున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కేపీహెచ్‌బీకాలనీ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భగత్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉండే ప్రేమ్‌కుమార్ భార్య దవ్వ కృప (38) రెండు సంవత్సరాలుగా జ్వరం, మూత్రాశయ, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతుంది. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 14న ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో విషం తాగింది. ఈ విషయాన్ని భర్త ప్రేమ్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేవైఎం ప్రొఫెషనల్ సెల్ కో ఆర్డినేటర్‌గా రామకృష్ణ

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ పీహెచ్‌డీ విద్యార్థి చల్ల రామకృష్ణను బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర ఇంటలెక్చువల్, ప్రొఫెషనల్ సెల్ కో ఆర్డినేటర్‌గా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ల మహేందర్ నియమించారు. ఈ సందర్భంగా గురువారం జేఎన్‌టీయూహెచ్ పరిశోధక విద్యార్థులు, ఇంజినీరింగ్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చల్ల రామకృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో విద్యార్థి ఉద్యమంలో పని చేసిన అనుభవంతో మరింత ముందుకు సాగుతానన్నారు. రామకృష్ణ నియామకం పట్ల నాయకులు జవ్వాజి దిలీప్, పితాని సందీప్, రాహుల్, పవన్, శివకృష్ణ, చందు, స్నేహిత్‌రెడ్డి, సాయి చరణ్, అరవింద్, రంజిత్ హర్షం వ్యక్తం చేశారు.

రేపు మెగా లోక్ అదాలత్

కుత్బుల్లాపూర్: అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డ్రంకన్ డ్రైవ్, లైసెన్స్‌లు లేకుండా పట్టుబడిన వాహనదారులు తమ ఆధార్, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్‌లతో వెంటనే అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, ఈ మెగా లోక్ అదాలత్‌లో తక్కువ జరిమానా విధించబడి కేసు పరిష్కారమవుతుందన్నారు. ఇతర వివరాలకు 7337469394/ 8143588616 నెంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు సన్మానం

నిజాంపేట్: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని గురువారం బాచుపల్లి పూజిత ఎన్‌క్లేవ్ వాసులు సత్కరించారు. పూజిత ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాధవి హాజరయ్యారు. కాలనీ ప్రెసిడెంట్ శరత్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ప్రసాద్ రాజు, నరేంద్రచౌదరి, భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూని సందర్శించిన యూజీసీ అధికారి



రోహిత్ త్రిపాఠిని సన్మానిస్తున్న యూనివర్సిటీ అధికారులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ యూనివర్సిటీని ఢిల్లీ నుంచి వచ్చిన మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, డిప్యూటీ సెక్రటరీ రోహిత్ త్రిపాఠి అధికారి గురువారం సందర్శించారు. క్యాంపస్‌ను, కళాశాలను పరిశీలించారు. అనంతరం యూనివర్సిటీ రెక్టార్ డా. విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యూనివర్సిటీ విభాగాల డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు. సమావేశంలో జేఎన్‌టీయూకి యూజీసీ నుంచి ఇంకా ఎటువంటి సహాయం కావాలో అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ రెక్టార్ యూనివర్సిటీలోని సౌకర్యాలు, ల్యాబ్ సౌకర్యాలు, సాంకేతిక పరిస్థితులు, టీచింగ్ సదుపాయాల గురించి వివరించారు. హైదరాబాద్ జేఎన్‌టీయూ పరిధిలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో సమన్వయం ఉండి, విద్యా బోధనలో ప్రమాణాలు తగ్గకుండా ఉత్తమ బోధన కొనసాగించాలని అధికారి సూచించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మూసాపేట: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కె మహేందర్ అన్నారు. మూసాపేటలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో క్లావో ఈఎన్‌టీ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ తూము సౌజన్య సమక్షంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..పేద ప్రజలు నివసించే బస్తీల్లో, పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పిట్ల మనోహర్, ఐలయ్య, తూము శైలేష్, కిశోర్, యాదయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రయాన్–3 మొదటి వార్షిక వేడుకలు



బొమ్మారెడ్డి నాగభూషణ్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న కేంద్ర మంత్రి పాండే(ఫైల్)

కూకట్‌పల్లి: జాబిల్లిపై అన్వేషణకు బయల్దేరిన చంద్రయాన్ -3 ఉపగ్రహం విజయం సాధించి సంవత్సరం పూర్తైన సందర్భంగా దేశ వ్యాప్తంగా మొదటి వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి మోదీ ఆదేశాల మేరకు చంద్రయాన్–3లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ఇప్పటికే అవార్డులను అందజేశారు. చంద్రయాన్–3లో కూకట్‌పల్లిలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన నాగసాయి ప్రెసిషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉపగ్రహ బ్యాటరీలకు రక్షణ కవచాలను అందజేసింది. రోవర్, ల్యాండర్, ప్రొపల్షన్ మాడ్యుల్స్‌లో బ్యాటరీలను అమర్చే అల్యూమినియం స్టాండ్స్, నాసిల్స్ స్లీవ్స్‌ను సమకూర్చింది. అదే విధంగా ఇస్రో నిర్వహించిన అనేక ప్రయోగాల్లో ఈ సంస్థ భాగస్వామ్యమైంది. ఇప్పటి వరకు 50 ఉప గ్రహాలకు నాగసాయి భాగస్వామ్యం అయ్యిందని సంస్థ నిర్వాహకులు ఇంజినీర్ బొమ్మారెడ్డి నాగభూషణ రెడ్డి తెలిపారు. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లతో కలిసి పని చేయటంతో పాటు ఏరో స్పేస్, యుద్ధ విమానాల విడిభాగాలు కూడా వివిధ విమాన తయారీ సంస్థలకు పరికరాలను సమకూరుస్తున్నామని తెలిపారు. చంద్రయాన్ విజయవంతమైన సందర్భంగా శుక్రవారం నాగసాయి ప్రెసిషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చంద్రయాన్ 3 విజయవంతంతో కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి పాండే ద్వారా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. అంతరిక్షంలో కూడా కూకట్‌పల్లి పేరు ప్రఖ్యాతలను ముందుకు తీసుకెళ్లినందుకు తనకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



గండిమైసమ్మలో అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

దుండిగల్: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు దుండిగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని తహసీల్దార్ మతిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, సహకార సంఘం బ్యాంకు డైరెక్టర్లు, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఆలోచనతో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు విస్మరించడం సరికాదన్నారు. రేషన్ కార్డును సాకుగా చూపి రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, చైర్మన్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, డైరెక్టర్లు, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు


రంగారెడ్డినగర్: తెలంగాణ గుర్తింపు పొందిన ఆఫరడబుల్ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ గ్రేటర్ కుత్బుల్లాపూర్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంగారెడ్డినగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్‌ల్లో నిర్వహించిన సమావేశంలో సుమారు 50 పాఠశాలల కరస్పాండెంట్లు వివిధ సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ గ్రేటర్ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడిగా వినోద్ జాదవ్, చైర్మన్‌గా కొల వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దయాకర్, కోశాధికారిగా శ్రీశైలం నియమితులయ్యారు. త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు ఆంజనేయులు, గిరి, నరసింహులు, నందారెడ్డి, భూపాల్ రెడ్డి, స్వరూప్ రెడ్డి, సీహెచ్ నరసింహులుగౌడ్, ప్రవీణ్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, సొంటిరెడ్డి పున్నారెడ్డి, నరేందర్, కృష్ణ, చిలుకూరి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణమెప్పుడో?

- ఆధునికీకరణ పేరిట ఉన్న షెల్టర్ తొలగింపు
- పునర్నిర్మాణంలో జాప్యం
- బస్సు కోసం రోడ్డుపైనే ప్రయాణికుల ఎదురుచూపులు



మోతీనగర్ ప్రధాన చౌరస్తాలో బస్సు కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు



మోతీనగర్: బస్‌షెల్టర్ లేకపోవటంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్, కబీర్‌నగర్‌లలో గతంలో బస్‌షెల్టర్లు ఉండేవి. కొత్త బస్ షెల్టర్లు నిర్మించడానికి గత పాలకులు భూమి పూజ సైతం చేశారు. ప్రధాన రోడ్డులో గతంలో ఉన్న స్థానంలోనే షెల్టర్ నిర్మించాలని ఆర్టీసీ కూకట్‌పల్లి డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. అక్కడ బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తే వ్యాపారులకు అడ్డు వస్తుందని అభ్యంతరాలు తెలపడంతో ఏర్పాట్లను విరమించుకున్నారు. కబీర్‌నగర్ బస్టాప్‌లో ఉన్న బస్సు షెల్టర్‌ను వాటర్ ఏటీఎం ఏర్పాటుతో దాన్ని తొలగించారు. నిత్యం బోరబండ నుంచి వందలాది మంది నగరంలోని పలు ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. నగరంలోని వివిధ ప్రాంతాలకే కాకుండా జిల్లా వాసులు కూడా రాకపోకలు కొనసాగిస్తుంటారు. వాహనాలు వేగంగా రావడంతో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు ప్రమాదాల బారిన పడ్డారు. గతంలో బస్ షెల్టర్ నిర్మాణం కోసం ఓ సీనియర్ సిటిజన్ ఆత్మహత్యాయత్నానికి సైతం పాల్పడ్డాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి మోతీనగర్ ,కబీర్‌నగర్‌లలో షెల్టర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



చందానగర్ సర్కిల్ నుంచి మూసాపేట సర్కిల్‌కు మెడికల్ అధికారి డా. కార్తీక్ బదిలీపై వచ్చారు. గురువారం సర్కిల్ ఎస్‌ఎఫ్‌ఏలు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది డా. కార్తీక్‌ను పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. – కూకట్‌పల్లి